సంపుటి :02 సంచిక :151 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 05, ఆగస్టు 2025

## ఫుడ్ పాయిజన్ పై సీరియస్

- కొర్కిశాల కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- నలుగురు వంట మనుషుల సస్పెన్షన్
- ఎస్ ఓకు షోకాజ్ నోటీస్
- అలసత్వాన్ని సహించబోమని స్పష్టం
- ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడి

04




## బీఆర్ఎస్ నేతలపై కక్షసాధింపు చర్యలు



- రాజకీయ దురుద్దేశంతో నివేదికలు
- న్యాయస్థానాల్లో ఆ నివేదికలు నిలబడవు..
- ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది..
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణ భవన్ లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

02



02

# లక్నవరానికి మేనేజరే శాపం !

- కాటేజీలను సొంతంగా వాడుకుంటూ జల్సా
- స్పీడ్ బోట్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- రెస్టారెంట్ నిర్వాహకులపై వేధింపులు
- మేనేజర్ తీరుకు వచ్చిన వారు వచ్చినట్లే వెనక్కి..
- ఫలితంగా ఫుడ్ లభించక పర్యాటకుల ఇబ్బందులు
- పర్యాటక కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి

### సర్.. ఆడిందే ఆట పాడిందే పాట

ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. ఇక్కడి ప్రకృతి రమణీయతను చూడటానికి, కేబుల్ బ్రిడ్జిపై నుంచి ప్రకృతిని చూడటానికి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సాధారణంగా నైతే ఇక్కడికి వచ్చే పర్యాటకులతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావాలి.. కానీ, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నపర్యాటకశాఖ మేనేజర్ వ్యవహార శైలి కారణంగా పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. వారికి కనీస వసతులు అందక ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. సదరు అధికారి తనకున్న అధికారాలను దుర్వినియోగం చేస్తుండటంతోనే ఈ పరిస్థి ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. కన్సల్టెన్సీ వ్యక్తిగా పనిచేస్తున్న ఈ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, ప్రభు త్వానికి నష్టం కలిగిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ అధికారికి రాష్ట్రంలో మరే ఇతర పర్యాటకశాఖ మేనేజర్‌కు లేనంతగా నెలకు రూ.50,000 వేతనం అందుతున్నది. అయినప్ప టికీ.. ఆయన విధుల పట్ల నిబద్ధత చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, పర్యాటకుల కోసం నిర్మించిన రెండు గదుల్లో ఒక గదిని గత రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో చూపకుండా, సొంత ఇల్లులా వాడుకుంటున్నా రని విమర్శలు ఉన్నాయి. దీనివల్ల రోజుకు రూ.3,000 చొప్పున పర్యాటకశాఖకు నష్టం వాటిల్లుతున్నది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## శివయ్యా... ఇటు చూడయ్యా..!




- కాళేశ్వరం ముక్తేశ్వరుడి ఆలయంపై అవినీతి ఆరోపణలు
- అర్చక పోస్టులపై డబ్బులు వసూలు చేసినట్లు సోషల్ మీడియాలో పోస్ట్ లు
- దేవస్థానంలో షాడో ఈవోగా అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- టెంపుల్ ఆవరణలోని దుకాణాల టెండర్లలోనూ గోల్ మాల్
- కింది స్థాయి సిబ్బందితో సొంతింటి వెట్టి చాకిరి
- కాళేశ్వరం సోషల్ మీడియాలో అటాకింగ్ కామెంట్స్

04

దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్య క్షేత్రం కాళేశ్వర దేవస్థానంలో అవినీతి ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఆ కాళేశ్వర - ముక్తీశ్వరుడి సన్నిధిలో పవిత్రంగా విధులు నిర్వర్తించాల్సిన ఓ అధికారి కాస్తా అపవిత్ర కార్యకలాపాలకు పాల్పడుతూ ఆలయ ప్రతిష్టను దెబ్బ తీసేలా వ్యవ హరిస్తున్నట్లుగా తెలుస్తోంది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనేది ఎంత నిజమే ఆ కాళేశ్వ రుడి సన్నిధిలో ఆ అధికారి లేనిదే ఏ కార్యమైన కార్యరూపం దాల్చదనేది అంతే నిజమనేది అక్షర సత్యం. దీంతో ఆ అధికారిది ఆలయంలో ఆడిందే ఆటగా పాడిందే పాటగా చలామణి అవుతుండగా నాకెవ్వరు సాటి అంటూ ఓపెన్ ఛాలెంజ్ నే విసురుతున్నాడు.

– అక్షరదర్బార్, కాటారం

# ముస్లిం ఉద్యోగుల ఆర్థిక సాయం



**- అనారోగ్యంతో చనిపోయిన పేద ముస్లిం ఉద్యోగి కుటుంబానికి రూ.1.40 లక్షల అందజేత**

అక్షరదర్బార్, వరంగల్: సాయం చేయాలనే ఆలోచన, సంకల్పం మనసులో ఉంటే సమస్య ఏ రూపంలో ఉన్నా సమాధానం దొరుకుతుంది. ఒక్క అడుగు ఎవరైనా ముందుకు వేసి దారి చూపగలిగితే అనేకమంది వారిని చూసి చైతన్యవంతులు అవ్వటం సత్యం. కలిసి నడవడం తథ్యం. ఇలాంటి సంఘటనే వరంగల్ లో జరిగింది. తోటి నిరుపేద ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి మానవత్వానికి ప్రతీకగా నిలిచారు రాష్ట్ర ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ కు చెందిన ఖాజా రఫీక్ వైద్యశాఖలో సూపరింటెండెంట్ గా పనిచేస్తూ కొంతకాలం క్యాన్సర్ తో పోరాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ దయనీయమైన స్థితిలో చనిపోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణలోని రాష్ట్ర ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు స్పందించి ఆర్థిక సహాయం అందజేయడం ద్వారా మానవతను చాటుకున్నారు.

**ఏకతాటిపైకి...**

ఇటీవల రాష్ట్రంలో చాలామంది ముస్లిం ఉద్యోగులు అనారోగ్య కారణంతో చనిపోవడం వల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతుండగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తెలంగాణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ముస్లిం ఉద్యోగులకు సహాయం చేయడానికి ఒక సంక్షేమ సంఘం ఏర్పాటు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అయిన భూపాలపల్లి జిల్లా డిప్యూటీ తహశీల్దార్ షఫీ సర్కార్ కు ఆలోచన వచ్చింది. తన అభిప్రాయాన్ని టీజీటీఏ స్టేట్ సహాధ్యక్షుడైన వరంగల్ తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్లారు. వీరిద్దరూ ఇంటెలిజెన్స్ డీఏఓగా పనిచేస్తున్న మశూక్ పాషాతో చర్చించారు. ఈ ముగ్గురు ఉద్యోగులు ఏకమై రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులను గుర్తించారు. ఫోన్ లో సంప్రదింపులు చేసి వాట్సాప్ సామాజిక వేదిక ద్వారా తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరుతో ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. 600 మందితో రాష్ట్ర వ్యాప్తంగా 'ముస్లిం ఉద్యోగుల సొసైటీ' ఏర్పాటు చేసుకుందామనీ ఒక గ్రూపు క్రియేట్ చేశారు. త్వరలో ఈ 600 మంది వరంగల్ లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి రాష్ట్ర కమిటీని ఎన్నుకునే క్రమంలో ఈ గ్రూపులోని ఖాజా రఫీక్ అనారోగ్యంతో అకాల మరణం చెందారు. దీంతో రాష్ట్ర ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు రూ.1.40 లక్షలు జమ చేశారు. మంగళవారం వరంగల్ లోని ఖాజా రఫీక్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబానికి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# బీఆర్ఎస్ నేతలపై కక్షసాధింపు చర్యలు



- రాజకీయ దురుద్దేశంతో నివేదికలు
- న్యాయస్థానాల్లో ఆ నివేదికలు నిలబడవు..
- ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది..
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణ భవన్ లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అక్షరదర్బార్, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నదని, రాజకీయ దురుద్దేశంతోనే కాళేశ్వరంపై నివేదిక సిద్ధం చేయించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కమీషన్ల పాలన నడుస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసిందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక, రైతులు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు రెండుసార్లు కూలిపోయినా నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక ఇవ్వలేదని, కానీ మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిన వెంటనే ఆగమేఘాల మీద నివేదిక ఇచ్చిందని దుయ్యబట్టారు. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ చీల్చి చెండాడుతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో పూర్తిగా ఆధారాలు లేవని, రాజకీయ దురుద్దేశంతో రూపొందించిందని ఆరోపించారు. కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఇవ్వడం లేదని, తుమ్మిడిహట్టి దగ్గర కాంగ్రెస్ పార్టీ ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై గోబెల్స్ ప్రచారం చేస్తోందని, తప్పుడు సమాచారం ఇస్తోందని మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే రిపోర్టులు కోర్టు ముందు నిలబడవని, ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీవీల్లో వచ్చే సీరియల్స్‌లా సీఎం రేవంత్ రెడ్డి రోజుకో అంశంపైన రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నాయని, సీఎం ముందు వాటిని పరిష్కరించాలని సూచించారు.

## కాళేశ్వరం కట్టడమే
# కేసీఆర్ చేసిన నేరమా

**డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్**


అక్షరదర్బార్ మరిపెడ : కాళేశ్వరంపై వేసిన పినాకి చంద్ర ఘోష్ కమిటీ నివేదిక దున్న ఈనిందంటే దూడను కట్టేయమన్నట్టుగా ఉందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. దున్న ఈనిందని కాంగ్రెస్ అంటే దూడను కట్టేయమని కమిషన్ చెప్పింది. వారు రాసిచ్చిన కాగితాలనే కమిషన్ బయటపెట్టిందని ఆయన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తూ ప్రజలను మభ్యపెడుతూ అమలుకాని హామీలను ఇచ్చి కాలం వెళ్లదీస్తుందని ఆరోపించారు. మూడేళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలనే ఘోష్ కమిషన్ తన నివేదికలో కూర్చింది. నివేదికలో తెలంగాణ గోస, నేటి అవసరాలు, ప్రజాకాంక్ష ఎక్కడ కనిపించలేదు. అలా అని సాంకేతిక అంశాలకు పరిమితం కాలేదు.

# లక్న 'వరానికి' మేనేజరే శాపం !

## సర్.. ఆడిందే ఆట పాడిందే పాట

- కాటేజీలను సొంతంగా వాడుకుంటూ జల్సా
- స్పీడ్ బోట్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగం
- రెస్టారెంట్ నిర్వాహకులపై వేధింపులు
- మేనేజర్ తీరుకు వచ్చిన వారు వచ్చినట్లే వెనక్కి..
- ఫలితంగా ఫుడ్ లభించక పర్యాటకుల ఇబ్బందులు
- పర్యాటక కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి







అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. ఇక్కడి ప్రకృతి రమణీయతను చూడటానికి, కేబుల్ బ్రిడ్జిపై నుంచి ప్రకృతిని చూడటానికి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సాధారణంగానైతే ఇక్కడికి వచ్చే పర్యాటకులతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావాలి.. కానీ, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న పర్యాటకశాఖ మేనేజర్ వ్యవహార శైలి కారణంగా పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. వారికి కనీస వసతులు అందక ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. సదరు అధికారి తనకున్న అధికారాలను దుర్వినియోగం చేస్తుండటంతోనే ఈ పరిస్థి ఏర్పడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కన్సల్టెన్సీ వ్యక్తిగా పనిచేస్తున్న ఈ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ అధికారికి రాష్ట్రంలో మరే ఇతర పర్యాటకశాఖ మేనేజర్‌కు లేనంతగా నెలకు రూ.50,000 వేతనం అందుతున్నది. అయినప్పటికీ.. ఆయన విధుల పట్ల నిబద్ధత చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, పర్యాటకుల కోసం నిర్మించిన రెండు గదుల్లో ఒక గదిని గత రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో చూపకుండా, సొంత ఇల్లులా వాడుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. దీనివల్ల రోజుకు రూ.3,000 చొప్పున పర్యాటకశాఖకు నష్టం వాటిల్లుతున్నది.

**స్పీడ్ బోట్ అక్రమ వినియోగం**

పర్యాటకుల కోసం ఉద్దేశించిన స్పీడ్ బోట్‌ను మేనేజర్ తన వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారని ఇప్పటికే పర్యాటకశాఖకు అనేకసార్లు ఫిర్యాదులు అందాయి. సాధారణ ప్రయాణికులు ఒక్క ట్రిప్‌కు రూ.350 చెల్లించాల్సి ఉండగా, మేనేజర్ మాత్రం ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ కోసం బోట్‌ను వాడేస్తున్నారని సమాచారం. మేనేజర్ సిబ్బందితోనూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈయన ధాటికి తాళలేకపోతున్నామని సిబ్బంది వాపోతున్నట్లు తెలిసింది. గతంలో మొదటి ఐలాండ్‌లో ఒక ప్రైవేట్ రెస్టారెంట్ మూతపడటం వెనుక కూడా ఈ మేనేజర్ పాత్ర ఉందని తెలిసింది. మూతబడిన రెస్టారెంట్‌పై నిర్వహణ బాగోలేదనే నెపం పెట్టి, 3వ ఐలాండ్‌లోని రెస్టారెంట్‌కు లాభం చేకూర్చేందుకు మేనేజర్ ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. మేనేజర్ ఆగడాలపై ఇప్పటికే కొందరు మంత్రి సీతక్కతో పాటు పర్యాటక కార్పొరేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు మేనేజర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సంస్థకు నష్టం కలిగించే వ్యక్తిని ఇంకా మేనేజర్‌గా కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పర్యాటకులకు ఫుడ్ లేదు..**

మేనేజర్ పోకడల కారణంగా ఇక్కడ రెస్టారెంట్లు నిర్వహించేవారు, వచ్చిన వారు వచ్చినట్లుగానే తిరిగి వెళ్లిపోతున్నారు. నిర్వాహకులపై ఏదో ఒక నెపం పెట్టి వారిని మేనేజర్ వెళ్లగొట్టేలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పర్యాటకులు ఇంతో ఇష్టంగా పిల్లాజెల్లాతో కలసి లక్నవరానికి వస్తే, తీరా ఇక్కడ సరైన ఫుడ్ దొరక్కపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేసేదేం లేక అక్కడ దొరికే అరకొర అల్పహారంతోనే పర్యాటకులు సరిపెట్టుకుంటున్నారు. మేనేజర్ పోకడల కారణంగా ఒకసారి లక్నవరానికి వచ్చే పర్యాటకుడు.. భవిష్యత్తులో మళ్లీ వచ్చేందుకు ఇష్టపడే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సదరు మేనేజర్ ఆగడాలను అరికట్టాలని, లక్నవరం టూరిజం స్పాట్‌ను పర్యాటకులకు అనుకూలంగా మార్చాలని పర్యాటకులు కోరుతున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

## పెద్ది, చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ, అక్షర దర్బార్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టాలని నర్సంపేట, పరకాల మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను గంగదేవపల్లిలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో నర్సంపేట, పరకాల నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యేలు వీక్షించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, జిల్లా పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఖండించి, నిజాలను గ్రామంలోని ప్రజలకు వివరించాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తోందని, రైతులకు నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండిపోయే విధంగా కుట్ర చేస్తోందని, ఈ దిగజారుడుతనాన్ని ప్రజలకు తెలియజేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల, నర్సంపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాలకు చెందిన జిల్లా స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### నిరుపేద విద్యార్థులకు అండగా

# గీతాంజలి విద్యాసంస్థలు



నర్సంపేట, అక్షర దర్బార్: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చదువుతున్న ఆవుల మనిదీపిక (4వ తరగతి), ఆవుల యశ్వంత్ (1వ తరగతి) లకు గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు అండగా నిలిచారు. తండ్రి ఆవుల ప్రవీణ్ గుండెపోటుతో మరణించడంతో, ఈ విద్యార్థులు స్కూల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ వేములపల్లి సుబ్బారావు, విద్యార్థులను చేరదీసి, పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తానని వారి తల్లి ఆవుల ధనలక్ష్మికి హామీ ఇచ్చారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహాయం నిత్యం అందిస్తానని సుబ్బారావు ఈ సందర్భంగా తెలిపారు. పేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తున్న వేములపల్లి సుబ్బారావును నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.



## మల్లక్కపేట ఆలయానికి హుండీ విరాళం

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం మల్లక్కపేటలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రముఖ వ్యాపారి వెనిశెట్టి సురేష్, ఆయన సతీమణి రేణుక దంపతులు హుండీని విరాళంగా అందజేశారు.మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో, వెనిశెట్టి సురేష్ తన తల్లి ధనలక్ష్మి ఆశీర్వాదంతో, తండ్రి మహంత్ జ్ఞాపకార్థం ఈ హుండీని సమర్పించారు. దాతలను ఆలయ చైర్మన్ మహేందర్ సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



## బీజేపీ 'సర్వవ్యాప్తి - సర్వస్పర్శ'

### ఇంటింటికీ మోడీ పాలన ప్రచారం

పరకాల, అక్షర దర్బార్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో 'సర్వవ్యాప్తి - సర్వస్పర్శ' కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో, బూత్ అధ్యక్షులు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ


చిట్యాల, అక్షర దర్బార్: చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పెండ్లి రవి ఇటీవల మరణించగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మధువంశీకృష్ణ, మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన కంచు చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆమె చిత్రపటానికి కూడా మధువంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు గజ్జి రవి, యూత్ అధ్యక్షుడు రాంబాబు, చిట్యాల టౌన్ యూత్ అధ్యక్షులు అల్లం రాజు, కొత్తపల్లి రాము, గోపగాని శివకృష్ణ, గోల్కొండ మహేష్, ఎలగొండ చిరంజీవి, గోపగాని వెంకటేశ్వర్లు, నీరటి నారాయణ, నాగిరెడ్డి శంకర్, కంచు తిరుపతి, గొర్రెటి ఓదెలు, గద్దల తిరుపతి, జన్నె జనార్ధన్, కలవేన ప్రవీణ్, నగరపు సాయి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

### రేషన్ కార్డుల పంపిణీ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

### నల్లవెల్లి దుగ్గొండి మండలాలలో రేషన్ కార్డుల పంపిణీ




అక్షర దర్బార్ నల్లబెల్లి/ దుగ్గొండి : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని నర్సంపేట ఎమ్మెల్యే జంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట నియోజకవర్గం లోని దుగ్గొండి నల్లబెల్లి మండల కేంద్రాలలో నూతన రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.దుగ్గొండి మండలంలో 1640రేషన్ కార్డులు, నల్లబెల్లి మండలంలో మొత్తం 1241 నూతన కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటికి నియోజకవర్గంలో మొత్తం 12273 రేషన్ కార్డులు అందించామని, మరిన్ని రేషన్ కార్డులు ఆమోదం కొరకు జిల్లా,రాష్ట్ర స్థాయిలో పరిశీలనలో ఉన్నాయని వాటిని కూడా త్వరలో అందిస్తామని తెలిపారు. రేషన్ కార్డులతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తున్నామన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒకటి రెండు ఆలస్యమైనప్పటికీ ఇచ్చినా వాగ్దానాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, తహసీల్దార్లు , డిప్యూటీ తహసీల్దార్లు, రైతులు, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, ఇతర నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- నర్సంపేట ఉన్నత పాఠశాలలో క్రీడా దుస్తులు పంపిణీ




అక్షర దర్బార్, నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు దాతల అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని రాణించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాత గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ మేములపల్లి సుబ్బారావు అందించిన క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులన్నారు ప్రభుత్వ పాఠశాలలో నాడు చదివిన విద్యార్థులే నేడు ఉన్నత స్థానాలను స్థిరపడ్డారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు. శంకర్, పిడి తిరుపతి, రామకృష్ణ, శంకరయ్య,వెంకట రాజేష్ సురేందర్ కల్పన, మానస, తదితరు లు పాల్గొన్నారు

## జూకల్ అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు



చిట్యాల, అక్షర దర్బార్: చిట్యాల మండలం జూకల్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ నంబర్ వన్‌లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు.

## వికలాంగులకు రూ.6016 పెన్షన్ ఇవ్వాలి

చిట్యాల, అక్షర దర్బార్: తెలంగాణ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సకినాల మల్లయ్య మంగళవారం చిట్యాలలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు తక్షణమే రూ. 6016 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు గొప్పలు చెప్పి, ఇప్పుడు మాట తప్పిందని ప్రభుత్వాన్ని విమర్శించారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, 7% రిజర్వేషన్లు కూడా కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ధర్నాకు కాంగ్రెస్ రెడీ

### - సీఎం రేవంత్ ఆధ్వర్యంలో నిరసన

### - బీసీ బిల్లుల ఆమోదం లక్ష్యంగా కార్యక్రమం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఆమోదించిన వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్ బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదాన్ని కోరుతూ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించనున్నాయి. ధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొననున్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలే కాకుండా, వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు కూడా ధర్నాలో పాల్గొనే అవకాశం ఉంది. తెలంగాణ నుంచి ఇప్పటికే కొన్ని పార్టీ శ్రేణులు సోమవారమే ప్రత్యేక రైలులో ఢిల్లీకి బయల్దేరి వెళ్లాయి. ధర్నా మరుసటి రోజు.. అంటే గురువారం సీఎం, మంత్రులు, పార్టీ శ్రేణులు రాష్ట్రపతిని కలిసి బీసీ బిల్లుల ఆమోదానికి వినతి పత్రాలు అందించనున్నాయి




### వర్కింగ్ ప్రెసిడెంట్ గా

# చెన్నమల్లు యాదవ్

అక్షరదర్బార్, వరంగల్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొంగల చెన్నమల్లు యాదవ్ ఏకగ్రీవంగా నియామకం అయ్యారు. మంగళవారం లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్ సమీపంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లబోయిన కిషోర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరిబోయిన రాజయ్య యాదవ్ నూతన కమిటీని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొంగల చెన్నమల్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేనబోయిన యాదవ్, ఉపాధ్యక్షులుగా రాజబోయిన కుమార్ యాదవ్, గడల రమేష్ యాదవ్, కందుల నరసయ్య యాదవ్, ఆంబోతు రాజు యాదవ్, కార్యదర్శులుగా సాదం సునీల్ యాదవ్, బొల్లబోయిన వీరస్వామి యాదవ్, మాదరబోయిన యాదగిరి యాదవ్, వేల్పుల శ్రీనివాస్ యాదవ్ లను ప్రకటించారు.



# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

## మాజీ ఎమ్మెల్యే గండ్ర



అక్షర దర్బార్, భూపాలపల్లి, : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నా, ప్రభుత్వం కమిషన్ల కోసం చూస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తోందని ఆరోపించారు. కుంగిన పిల్లర్లను రిపేర్ చేయడంలో గానీ, పంపులను ఆన్ చేయడంలో గానీ కాలయాపన చేస్తూ, రైతులకు నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండిపోయేలా కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. ఈ కుట్రలను, తప్పుడు ప్రచారాలను ప్రజలకు వివరించి తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# కొత్తగూడ ఎస్ఐగా రాజ్‌కుమార్ బాధ్యతలు




కొత్తగూడ, అక్షర దర్బార్: కొత్తగూడ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా ఇమ్మడి రాజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బయ్యారంలో విధులు నిర్వహించిన రాజ్‌కుమార్, శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రథమ కర్తవ్యమని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# బానోతు దేవేందర్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం



అక్షర దర్బార్, కొత్తగూడ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బొత్తవానిగూడెంలో సీపీఎస్ (CSP) ఆధ్వర్యంలో ఒక ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఏర్పాటులో ప్రజా నాయకుడు బానోతు దేవేందర్ కీలక పాత్ర పోషించారు. బానోతు దేవేందర్ గతంలో బొత్తవానిగూడెం, ముస్మి తండా, కార్నగండి ప్రాంతాలకు చెందిన సుమారు 80% మంది ప్రజలకు లేబర్ ఇన్సూరెన్స్ చేయించారు. ఈ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకునేలా, ఆయన చొరవతో సీపీఎస్ ఆధ్వర్యంలో ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్యాంపులో 54 రకాల రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి, ప్రజలకు తమ ఆరోగ్య స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించారు. బానోతు దేవేందర్ ప్రజల ఆరోగ్య సంరక్షణ పట్ల చూపిస్తున్న నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనం.



www.aksharadarbar.com
అక్షర దర్బార్ Voice of the people

# యూరియా అందుబాటులో ఉంది

## కలెక్టర్ డా. సత్య శారద

ఖానాపూర్, అక్షర దర్బార్: రైతులకు సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. మంగళవారం ఆమె ఖానాపూర్ మండలం బుధరావుపేటలోని పీఏసీఎస్, జడ్.పి.హెచ్.ఎస్. హైస్కూల్, నెక్కొండలోని మహాత్మ జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించి, రైతులకు ఫోన్ పే ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యాబోధన, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. డిజిటల్ ప్యానెల్, కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండటంపై, అలాగే కుళ్లిపోయిన కూరగాయలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతతో కూడిన విద్య, భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.



# విద్యార్థినులను పరామర్శించిన మాజీ ఎమ్మె ల్యే

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి : మొగుళ్ళపల్లి మండలం కొరికిశాలలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినీలు అస్వస్థతకు గురవగా, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వారిని పరామర్శించారు. కలుషితమైన ఆహారం వల్లే ఈ ఘటన జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ, నాణ్యత లేని ఆహారంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను పాఠశాలను సందర్శించి మంచి ఆహారం అందించాలని సూచించినా యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఘటనకు కారణమైన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

# శివయ్యా... ఇటు చూడయ్యా..!

- కాళేశ్వరం ముక్తేశ్వరుడి ఆలయంపై అవినీతి ఆరోపణలు
- అర్చక పోస్టులపై డబ్బులు వసూలు చేసినట్లు సోషల్ మీడియాలో పోస్ట్ లు
- దేవస్థానంలో షాడో ఈవోగా అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ అధికారి
- టెంపుల్ ఆవరణలోని దుకాణాల టెండర్లలోనూ గోల్ మాల్
- కింది స్థాయి సిబ్బందితో సొంతింటి వెట్టి చాకిరి
- కాళేశ్వరం సోషల్ మీడియాలో అటాకింగ్ కామెంట్స్




అక్షరదర్బార్, కాటారం: దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్య క్షేత్రం కాళేశ్వర దేవస్థానంలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కాళేశ్వర - ముక్తీశ్వరుడి సన్నిధిలో పవిత్రంగా విధులు నిర్వర్తించాల్సిన ఓ అధికారి కాస్తా అపవిత్ర కార్యకలాపాలకు పాల్పడుతూ ఆలయ ప్రతిష్టను దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనేది ఎంత నిజమే ఆ కాళేశ్వరుడి సన్నిధిలో ఆ అధికారి లేనిదే ఏ కార్యమైన కార్యరూపం దాల్చదనేది అంతే నిజమనేది అక్షర సత్యం. దీంతో ఆ అధికారిది ఆలయంలో ఆడిందే ఆటగా పాడిందే పాటగా చలామణి అవుతుండగా నాకెవ్వరు సాటి అంటూ ఓపెన్ ఛాలెంజ్ నే విసురుతున్నాడు. అంతేకాకుండా ఆ అధికారికి నచ్చిన వారిని నెత్తిన పెట్టుకోవడం నచ్చని వారిని సొంతింటి వెట్టి చాకిరి చేయించుకోవడం పరిపాటిగా మారిందని సర్వత్రా చర్చ జరుగుతుంది. గతంలో ఆ అధికారి తీరుపై పలు ఆరోపణలు ఉన్నప్పటికీ అయనగారికున్న ధన బలంతో అవన్నీ దిగదుడుపనే చర్చ అంతటా సాగుతుంది. కాగా కింది స్థాయి సిబ్బందిచే బలవంతపు ఇన్సూరెన్స్ పాలసీలు కట్టిస్తూ ఇబ్బందులు పెడుతున్నట్లుగా తెలుస్తోంది. సదరు అధికారి తన సహచర ఉద్యోగితో కలిసి ఇటీవల ఓ వినూత్న దందాకు తెరలేపినట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై స్థానిక సోషల్ మీడియా వాట్సప్ గ్రూపులో చర్చ జరుగుతుండగా ప్రస్తుతం అది హాట్ టాపిక్ అవుతున్నది.

### జూనియర్లకు అందలం

కాళేశ్వరం దేవస్థానంలో అర్చక విభాగంతో పాటు వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ ఉద్యోగులకు సదరు అధికారి అందలం ఎక్కిస్తున్న తీరు పట్ల సీనియర్ అర్చకులు, ఉద్యోగులు మనో వేదన పడుతున్నట్లుగా సమాచారం. ఆ అధికారికి అంటకాగిన ఉద్యోగులు ఎవరైనా సరే వారికి అన్నీ తానై ముందుంటాడట. ఈ క్రమంలోనే ఆలయంలోని అన్ని అర్హతలు కల్గిన కొందరు సీనియర్ అర్చకులని పక్కన పెట్టి జూనియర్ అర్చకులకు పదోన్నతులు కల్పించి తన స్టామినా ఏంటో నిరూపించుకున్నాడట. ఇందుకు గానూ ఆ జూనియర్ అర్చకుల నుండీ రూ. 4 లక్షల నుండీ రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. అంతేకాకుండా తన అనచరుడనే కారణంతో ఎలాంటి క్యాడర్ స్ట్రెంత్ లేని ఓ నాలుగో తరగతి ఉద్యోగిని టెంపుల్ లోని ఉన్నత పదవికి ఇంచార్జిగా నియమించి తన మార్క్ ఏంటో చూపెట్టుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అలాగే కాళేశ్వరం టెంపుల్ లో విధులు నిర్వహిస్తున్న ఓ అర్చకుడిని పలు వివాదాలు వెంటాడగా దేవాదయ శాఖ డిపార్ట్మెంట్ నుండి వచ్చే పనిష్మెంట్ తప్పించడానికి గానూ రూ.30లక్షలు గుంజినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### దుకాణ టెండర్లలోనూ ఆరోపణలు

ప్రతీ ఏడాది కాళేశ్వరం ఆలయ ఆవరణలో నడిపే దుకాణదారుల టెండర్లలోనూ ఆ అధికారి వ్యవహరించే తీరుపై సైతం చర్చలకు దారితీస్తుంది. ఆ అధికారికి అండగా ఉండే వ్యక్తులు ఎవరైనా టెండర్లలో పాల్గొనాలకుంటే వారికి వేలంపాట లేకుండానే టెండర్ ని అప్పగించే చరిష్మా ఆ అధికారి సొంతమట. ఈ మధ్య ఓ షాపు నిర్వాహకుడు షాపు ముందు షెడ్డు వేసుకోగా ఆ షెడ్డు తొలగించాలని, ఆ తర్వాతే వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుందని హుకూం జారీ చేసాడట. ఆ తర్వాత ఏమైందో ఏమో కానీ ఎలాంటి సరీసప్పుడు లేకుండానే వారు టెండర్ లో పాల్గొనడం, వీరు గమ్మున ఊరుకోవడం జరిగిపోగా ఇప్పటికీ ఆ షెడ్డు అలానే దర్శనమివ్వడం కోసమెరుపు. ఇలా ఏక చత్రాధిపత్యంగా సదరు అధికారి కాళేశ్వరుడి సన్నిధిలో రాజ్యమేలుతుండగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆ శివయ్యని వేడుకుంటున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆ ఉద్యోగిపై డేగ కన్ను వేసి అతని చర్యలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

# ఫుడ్ పాయిజన్ పై సీరియస్



- కొర్కిశాల కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- నలుగురు వంట మనుషుల సస్పెన్షన్
- ఎస్ ఓకు షోకాజ్ నోటీస్
- అలసత్వాన్ని సహించబోమని స్పష్టం
- ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడి



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: విద్యార్థుల సంక్షేమంలో అలసత్వాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం పురుగుపడిన అల్పాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం వహించిన నలుగురు వంటమనుషులు ఉమాదేవి, రజిత, సరిత, లక్ష్మిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కొత్తగా నియమితులైన వంటవాళ్లతో ముఖాముఖి మాట్లాడి మంచిగా వంట చేయాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని నాణ్యతకు కట్టుబడాలని, పాడైన బియ్యం, సరుకులు వినియోగించొద్దని స్పష్టం చేశారు. జిల్లాలోని 62 సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు వారి సమస్యలను తెలియచేయడానికి వీలుగా ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదుల బాక్స్ కు తాళం వేయాలని, విద్యార్థులు తమ సమస్యలను ఆ పెట్టెల్లో స్వేచ్ఛగా రాసి వేయాలని, ప్రతి వారం వాటిని తెరచి సమస్యలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే విద్యా శాఖ కార్యాలయంలో 9949194492, 9000996933, 9441924901 కంట్రోల్ రూము నంబర్లు ఏర్పాటు చేయాలని, ఈ నంబర్లకు నేరుగా కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. అందిన సమాచారం గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అల్పాహారంలో పురుగుపడిన ఘటనపై ఎస్ ఓ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓకు సూచించారు. 8, 9, 10వ తరగతులను పరిశీలించి విద్యార్థులతో ఆహార నాణ్యత అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యే వరకు ఆరోగ్య శిబిరం కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఇంఛార్జి వైద్యాధికారి డా శ్రీదేవి, తహసీల్దార్ సునీతా, ఎంపీడీఓ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915